క్లుప్తంగా

ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దు..



రాస్తారోకో నిర్వహిస్తున్న బంజారా సోదరులు

కారేపల్లి: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించవద్దని.. కారేపల్లి బస్టాండ్ సెంటర్లో బంజారాలు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు బస్టాండ్ సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించవద్దని నినదించారు. ఈ సందర్భంగా బంజారా సోదరులు మాట్లాడుతూ.. కొంతమంది స్వలాభం కోసం ఎస్టీల మధ్య వివాదం సృష్టించాలని, రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉండే ఆదివాసీలు, బంజారాలను విడదీసే కుట్ర జరుగుతుందన్నారు. ఎస్టీలు ఐక్యమత్యంగా ఉండి కుట్రదారుల పన్నాగాలను తిప్పికొట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాణోతు బన్సిలాల్, ఉద్యోగ సంఘ నాయకులు రాంకోటి, రమేష్, బంజార సోదరులు మోహన్, దేవ్‌సింగ్, కోటేశ్వరరావు, సుజాత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కృష్ణయ్య

కల్లూరు: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు విజ్ఞాన్ విద్యానికేతన్‌లో మండల అధ్యక్షుడు వేల్పుల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు ఉద్యోగుల భవిష్యత్ నిధి కోసం దాచుకున్న డబ్బులు ప్రభుత్వ పరంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఏడాది క్రితం రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలు నేటికి చెల్లించలేదన్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ అందక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ వెంటనే చెల్లించాలని, నగదు రహిత వైద్యం కోసం తగిన ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చెంచురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమల్ల సుబ్బయ్య, కేశవరెడ్డి, పెనుబల్లి అధ్యక్షుడు టీవీ రామారావు, మండల ప్రధాన కార్యదర్శి కడియాల ఫ్రాన్సిస్, కార్యదర్శి సముద్రాల పుల్లారావు, శ్రీనివాస్‌దాస్, జీనుగు మోషన్న, కట్టా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



సత్తుపల్లిలో కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదివారం పరామర్శించారు. బైపాస్‌రోడ్‌లోని బెజవాడ గాంధీ, ఆల్తాఫ్ కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, సుధీర్, మట్టా సుజాత, హారిక పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతకక్షలను దృష్ట్యా గ్రామానికి చెందిన అజయ్, జల్లి వినోద్, నానిలు.. అదే గ్రామానికి చెందిన నాటురాయి వెంకట్రావు, అతని భార్య అనూషలపై శనివారం దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు ఆదివారం వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

నలుగురిపై..

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో బొడ్రాయి సెంటర్‌లో శనివారం రాత్రి వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో బత్తుల పద్మ, శివకృష్ణ లపై నలుగురు వ్యక్తులు దాడి చేయగా ఇరువురికి గాయాలైనాయి. ఈ ఘటనపై పద్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తుల వెంకయ్య, ఆంజనేయులు, అప్పారావు, రాజు లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

అష్టకష్టాల ‘వంట’

- ఆరు బయటే మధ్యాహ్న భోజనం తయారీ
- డిసెంబర్ నుంచి బిల్లులు పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



మత్కేపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో వంట చేస్తున్న నిర్వాహకులు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం సమస్యల మంటపై ఉడుకుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లోని వంట గదుల నిర్మాణాలు, బిల్లులు, వేతనాల చెల్లింపుపై శ్రద్ధ చూపకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఆరుబయటే మధ్యాహ్న భోజనం తయారు చేయాల్సి రావటంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల పక్కనే పొయ్యి పెడుతుండటంతో పొగతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల్లో వంటగదులను నిర్మించాలి. ఇదిలాఉండగా గత ఏడాది డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు గుడ్డు బిల్లులు, 9, 10 తరగతులకు భోజనం బిల్లులు డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్నాయని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని వంట గదుల నిర్మాణాలపై ‘సాక్షి’ప్రత్యేక కథనం..

మండలంలోని వివరాలిలా..

మధిర నియోజకవర్గంలోని మధిర, చింతకాని, ఎర్రుపాలెం, బోనకల్, ముదిగొండ మండలాల్లో మొత్తం 162 ప్రాథమిక, 25 ప్రాథమికోన్నత, 60 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 56 పాఠశాలల్లో వంట గదుల్లేవు. వంట గదులు లేకుండా ఉన్న పాఠశాలల్లో ఎక్కువగా ఉన్నత పాఠశాలలే ఉన్నాయి. ఇదిలాఉండగా వంట గదులున్న కొన్ని పాఠశాలల్లో కూడా గదులు సక్రమంగా లేక ఆరుబయటే వంట చేస్తున్నారు. వంట గదులు లేవు. వంట గదులు లేని పాఠశాలల్లో వంట గదుల నిర్మాణం కోసం ఒక్కో వంట గది నిర్మాణానికి రూ.75 వేలు మంజూరు చేశారు. వంట గది నిర్మాణానికి రూ.75 వేలు సరిపోవని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవటంతో అదనంగా మరో రూ.75 వేలను మంజూరు చేస్తామని చెప్పిన ఉన్నతాధికారులు నిధులను మంజూరు చేయకపోవటంతో పాఠశాలల్లో వంట గదుల నిర్మాణాల ఊసే లేకుండా పోయింది.

ఏజెన్సీ నిర్వాహకుల ఇక్కట్లు..

పాఠశాలల్లో వంట గదులు లేకపోవటంతో ఏజెన్సీ నిర్వాహకులు పాఠశాల ఆవరణలోని ఆరుబయటే వంట తయారుచేసి విద్యార్థులకు అందిస్తున్నారు. అయితే పాఠశాల ఆరుబయట కట్టెల పొయ్యి మీద వంట చేయటం ఇబ్బందిగా ఉంటుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించటం సాధ్యం కావటం లేదన్నారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్‌లో వర్షాలు కురుస్తుండటంతో వంట చేయటానికి ఇబ్బందికరంగా ఉంటుందని నిర్వాహకులు వాపోతున్నారు. ఇదిలాఉండగా భోజనం, గుడ్లు బిల్లులతో పాటు తమ వేతనాలు కూడా గత డిసెంబర్ నుంచి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పాఠశాలల్లో వంట గదుల నిర్మాణాలు, సకాలంలో బిల్లులు, వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా వంట గది ఉండాలి. పాఠశాలల్లో వంట గదులు లేక ఆరుబయట వంట చేయటం ఆరోగ్యకరం కాదు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో ఉపాధిహామీ పథకం కింద వంట గదులను నిర్మించాల్సి ఉంది. వంట గదులు లేని పాఠశాలల్లో గదుల నిర్మాణానికై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– సలాది రామారావు, మండల విద్యాశాఖాధికారి, చింతకాని

వంట గదులు నిర్మించాలి..



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి వంట గదులను నిర్మించాలి. వంట గదులు లేక ఆరుబయటే వంట చేయటం ఇబ్బందిగా ఉంది. కట్టెల మీద తరగతి గదుల పక్కన వంట చేయటంతో పొగ వలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వంట గదులను నిర్మించే విధంగా తగు చర్యలు చేపట్టాలి.

– దంతెలపల్లి సులోచన, ఏజెన్సీ నిర్వాహకురాలు, మత్కేపల్లి

ఇబ్బందులు పడుతున్నాం..



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయటానికి వంట గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆరుబయట వంట చేయటం కష్టంగా ఉంటుంది. వంట గదుల నిర్మాణం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. పెండింగ్‌లో ఉన్నటువంటి గుడ్లు, భోజనం బిల్లులు చెల్లించాలి.

– తప్పెట పుల్లమ్మ, ఏజెన్సీ నిర్వాహకురాలు, కొదుమూరు

వైద్య శిబిరం విజయవంతం



శిబిరంలో మందులు అందిస్తున్న ఎన్నారై రాకేష్

బోనకల్: బోనకల్ మండల పరిషత్‌కార్యాలయంలో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్, కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ ట్రస్ట్‌ను పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. అయితే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు 5ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాద్, ప్రముఖ ఎన్నారై బి.రాకేష్‌లతో పాటుగా వైద్య సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను మండల ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా బత్తినేని నాగప్రసాద్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి కామకోటేశ్వరావు, బిజేయూ జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లిఖార్జున్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనంద్‌రావు, అఖిలపక్ష నాయకులు నల్లమోతు సత్యనారాయణ, పిల్లలమర్రి నాగేశ్వరావు, క్యాంప్ నిర్వాహకులు బొమ్మినేని కొండల్‌రావు, ఆకెన పవన్, యంగల గిరి, వైద్యుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు మూసివేత



సత్తుపల్లిలో మూసివేసిన రామాలయం

సత్తుపల్లిటౌన్: చంద్రగ్రహణం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ఆలయాలను అర్చకులు మూసివేశారు. తిరిగి గ్రహణం వీడిన తర్వాత సోమవారం ఉదయం సంప్రోక్షణ చేసి దర్శనం కల్పించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పామాయిల్ ఫ్యాక్టరీ పనులు పరిశీలించిన దయానంద్

వేంసూరు: మండల పరిధిలోని కల్లురుగూడెంలో చేపట్టిన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ పరిశీలించారు. కాంట్రాక్టర్, ఇంజనీర్‌లతో మాట్లాడి ఫ్యాక్టరీ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మన బోయిన వెంకటేశ్వరరావు, మందపాటి రాఘవరెడ్డి, నీలపాల నాగరాజు, మేడా వెంకటేశ్వరరావు, కుక్కపల్లి శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి విగ్రహ ఏర్పాటుకు సమావేశం



మాట్లాడుతున్న నారాయణవరపు శ్రీనివాస్

సత్తుపల్లి: అందరి సహకారంతో శ్రీకాంతాచారి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరికల్లా విగ్రహ నిర్మాణ పనులు పూర్తి చేసి అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీఎస్ చారి, టి.నాగాచారి, దుస్సా వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, ప్రసాద్, రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు, సాగర్, వీరివాడ నాగభూషణం, వెంకట్రామయ్య, చారి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



క్యూలో నిలబడిన రైతులు, పరిశీలిస్తున్న అధికారులు

ముదిగొండ: మండలంలోని సహకార సొసైటీల ద్వారా బాణాపురం, ముదిగొండ, మేడేపల్లిలలో ఆదివారం రైతులకు 30టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏడీఏ విజయచంద్ర, ఏఓ సరిత తెలిపారు. బాణాపురంలో యూరియా పంపిణీ వద్ద రైతులు బారులు దీరారని.. కూపన్ల ద్వారా ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా అందించాలన్నారు. ఏడీఏ, ఏఓ ఆయా కేంద్రాలను పరిశీలించి.. ఏఈఓలు, సొసైటీ సిబ్బందితో కలిసి 675మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ఎప్పటికప్పుడు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై హరిత, ఏఈఓలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కారేపల్లి సొసైటీలో..



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

కారేపల్లి: కారేపల్లి సొసైటీలో రైతులకు కూపన్లపై యూరియా పంపిణీని ఆదివారం సింగరేణి తహసీల్దార్ అనంతుల రమేష్, ఎస్సై గోపి పరిశీలించారు. సొసైటీ గోడౌన్‌లో ఎరువులను, స్టాక్ రికార్డులను వారు పరిశీలించారు. కూపన్ల వారిగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలని సొసైటీ సీఈఓ బొల్లు హన్మంతరావుకు సూచించారు. యూరియా పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని, మధ్యవర్తులను నమ్మి వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, రైతులు నేరుగా సొసైటీ కార్యాలయాలకు వచ్చి వ్యవసాయాధికారి, ఎస్సైల సమక్షంలో ఇచ్చే కూపన్లు పొంది యూరియాను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది దమ్మాలపాటి నాగేశ్వరరావు, ముండ్ల సురేష్, ఉండం సాంబశివరావు, షేక్ యాకూబ్ పాష ఉన్నారు.

‘గాడి’పడిన రోడ్డు

ముదిగొండ: మండలంలోని వల్లబి, బాణాపురం వద్ద చప్టాపై గాడి పడి కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టుగా ఉన్న చప్టా తారు లేచి వరదపోటుకు గాడిపడింది. వల్లబి పెద్ద చెరువు నుంచి వచ్చే వరదకు ఇటీవల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అప్పటి నుంచి ఆ రోడ్డుపై కనీస మరమ్మతులు కూడా చేయించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవాలని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వల్లబి వద్ద చప్టాపై కొట్టుకుపోయి గాడి పడిన రోడ్డు

‘వాట్సాప్’లో వ్యవసాయం

- వాట్సాప్ చానల్ ప్రారంభించిన వ్యవసాయశాఖ
- రైతులకు నిత్యం పంటలపై సూచనలు



వాట్సాప్ చానల్‌లో పంట పురుగుల నివారణ మార్గాలు, ధరల వివరాలు చూపిస్తున్న దృశ్యం

కొణిజర్ల: ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్న సోషల్ మీడియా ద్వారానే రైతులకు.. సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఏ సమాచారాన్ని అయినా క్షణాల్లో ప్రజలకు చేరవేస్తున్న ఈ తరుణంలో వ్యవసాయ శాఖాధికారులు సైతం టెక్నాలజీని వాడుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, సాగు పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పంటల్లో చీడపీడలు తదితర విషయాలపై రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేసేందుకు, సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. పంటల సాగులో ఎదురవుతున్న సమస్యల గురించి రైతులు వాట్సాప్ ద్వారా రైతులు పరిష్కారం తెలుసుకోవచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి రైతు ఈ వాట్సాప్ చానల్‌లో చేరవచ్చు. సమాచారం అంతా తెలుగులోనే ఉండటంతో కొద్ది పాటి చదువు వచ్చిన రైతు కూడా సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. దీంతో పంటల్లో తెగుళ్లు, పురుగులు తదితరాలను ఫొటోల ద్వారా చూపిస్తుండటంతో రైతులకు కూడా తమ పంటలకు ఏ తెగులు సోకింది. ఏ పురుగు పాకిందనే విషయం సులభంగా తెలుసుకునే అవకాశం ఉంది. వెంటనే దాని నివారణకు తీసుకోవాల్సిన సూచనలు పాటించి సస్యరక్షణ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే రైతులు ఈ వాట్సాప్ చానల్‌లో చేరాలంటే తమ పరిధిలో ఉన్న ఏఈఓ లను సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగకరం..



వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలంగాణ అనే వాట్సాప్ చానల్ రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. వ్యవసాయశాఖ తరుపున మేము ప్రతిరోజూ ఊరూరు తిరిగి పంటలు పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు అప్పటికప్పుడే తమ ఫోన్ ద్వారా పంట సస్యరక్షణ చర్యలకు సూచనలు సలహాలు పొందవచ్చు.

– డి.బాలాజీ, ఏఓ, కొణిజర్ల

రైతు సదస్సును జయప్రదం చేయండి



చింతకాని: మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి



వైరారూరల్: మాట్లాడుతున్న కృష్ణ

చింతకాని/వైరారూరల్/కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న ఖమ్మంలో ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సంఘ నాయకులు దొబ్బల క్రిష్ణ తెలిపారు. ఆదివారం చింతకానిలోని ప్రొద్దుటూరు గ్రామంలో, వైరాలోని రెబ్బవరంలో, కొణిజర్ల మండలంలోని అమ్మపాలెంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందని, తక్షణమే రైతులకు సరిపడా యూరియా, ఎరువులు అందించాలన్నారు. రైతులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం పత్తి దిగుమతిపై ఉన్న 11శాతం సుంకాన్ని రద్దు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో పత్తి మార్కెట్లోకి వచ్చేనాటికి విదేశీ పత్తిని దిగుమతి చేసుకోవటం వలన ధరలు పడిపోయి పత్తి రైతులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం దిగుమతి సుంకాన్ని రద్దు చేయటంతో పత్తి రైతులు దివాలా తీసి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని తెలిపారు. రైతాంగ ప్రయోజనాల కోసం నిర్వహించనున్న సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు వెంకటనర్సయ్య, కోటయ్య, చిన్నవెంకటి, బండారుపల్లి ముత్తయ్య, వలకొండ శ్రీనివాసరావు, తాటికొండల సూర్యం, మేడేపల్లి వెంకటేశ్వర్లు, షేక్. ఇమామ్‌బీ, షేక్. ఖాసీం, మునిగే కోటేశ్వరరావు, డేరంగుల లక్ష్మయ్య, వెంపటి పరశురాములు, నరసింహారావు, లాలయ్య, పరశురాములు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతకాని: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో లబ్ధిదారులకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన షేక్ మీరాసాహెబ్, కొమ్మిని లక్ష్మీ, గండు సౌజన్య లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ. 1.25 లక్షల విలువైన చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడుపల్లి భాస్కర్, బండి శ్రీను, పాలకుర్తి వెంకటేశ్వర్లు, మాసబోయిన రామారావు, సామినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెవాడలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న నాయకులు

ఘనంగా వినాయకుడి నిమజ్జనం



వైరా: గణేశుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 9 రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఆదివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గణేషుడి ప్రసాదం లడ్డు వేలం పాట నిర్వహించగా ఒక కుటుంబం 1.5 లక్షలకు లడ్డు దక్కించుకున్నారు. అనంతరం మేళాతాళాలు, సాంస్కృతిక నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా నిమజ్జన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కిరణ్‌కుమార్, విశ్వేశ్వరరావు, శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లడ్డూ వేలంపాటలు..



సత్తుపల్లిటౌన్: లడ్డూను రూ. 1.20 లక్షలకు దక్కించుకున్న సాత్విక్‌నాయుడు

సత్తుపల్లిటౌన్: శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణనాథుల చేతుల్లో పూజలందుకున్న లడ్డూలను వేలంపాటలో దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. శనివారం అర్ధరాత్రి వరకు స్థానిక రింగ్‌సెంటర్‌లో పట్టణంలోని వినాయక లడ్డూలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. పట్టణ శివారులోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల గణపతి లడ్డును రూ. 1.20లక్షలకు, కోదండ రామాలయం ప్రాంగణంలోని వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల గణపతి లడ్డూను రూ. 1.11 లక్షలకు భక్తులు దక్కించుకోగా.. గంగారంలో రూ.60వేలకు, హనుమాన్‌నగర్‌లో రూ.46వేలు ఇలా పలుచోట్ల భక్తులు పోటీపడి మరీ లడ్డూలను వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.